రూ.77 లక్షలతో స్ట్రామ్ వాటర్ లైన్



డివిజన్‌లో పర్యటిస్తున్న జెడ్సీ, కార్పొరేటర్ డీసీ తదితరులు

రామంతాపూర్: డివిజన్ పరిధిలోని శ్రీనివాసపురం, ఈస్ట్ రామ్ శంకర్‌నగర్ కాలనీలో గత కొన్నేళ్లుగా వర్షాకాలంలో వరద నీరు పెద్ద ఎత్తున రోడ్లపైనే నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామని, కార్పొరేటర్ బండారు శ్రీవాణివెంకట్‌రావు చెప్పారు. దీనికి స్పందించిన జెడ్సీ స్ట్రాంగ్ వాటర్ పనులకు రూ.77 లక్షలు మంజూరు చేస్తున్నట్లు వివరించారు. ఈ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని ఆయన హామీ ఇచ్చారన్నారు. ఉప్పల్ జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు, నాగేందర్, డీఈ చందన డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్: మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. 25వ డివిజన్ ఇందిరానగర్‌లో రూ. 10 లక్షలతో సీసీరోడ్డు పనులు, 28వ డివిజన్‌లో రూ. 6లక్షలతో పార్కు ప్రహరీ నిర్మాణానికి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మౌలిక వసతులైన తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్యం నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతికిశోర్‌గౌడ్, కార్పొరేటర్లు చీరాల నర్సింహ్మ, జక్కల పద్మ జయరాములు, సుమన్‌నాయక్, కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



విద్యార్థులతో కౌశిక్‌రెడ్డి

బోడుప్పల్: విద్యార్థి దశ నుంచి నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ టెక్నికల్ డైరెక్టర్ ఆపరేషన్స్ కౌశిక్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్ పాఠశాలలో బుధవారం నిర్వహించిన ఇన్వెస్టిట్యూర్ సెర్మనీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులకు ఎన్నికలు నిర్వహించి స్కూల్ హెడ్‌బాయ్, హెడ్ గార్ల్, స్పోర్ట్స్, కల్చరల్, క్రమశిక్షణ కమిటీలను ఎన్నుకున్నామన్నారు. ఎన్నికైన విద్యార్థులను ఈ సందర్భంగా అభినందించారు. ప్రిన్సిపాల్ నీలిమాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బంగ్లాలో హిందువులకు రక్షణ కల్పించాలి

కాప్రా: బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలని కోరుతూ.. కాప్రా ఈద్గా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. కాప్రా మండల కార్యాలయం ఎదుట నిర్వహించిన నిరసనలో ఈద్గా కమిటీ చైర్మన్ ఎం.కే బద్రోద్దీన్ మాట్లాడుతూ.. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఖండిస్తున్నామని, వారికి అక్కడి ప్రభుత్వం రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఏ రహీం, షేక్ సలీం, ముత్తవలి ఖాండ్‌బాయ్, గౌస్, మహ్మద్ రెహమాన్, షరీఫ్, నూరుద్దీన్, జిలానీ, పర్వేజ్, అహ్మద్, మస్కత్, రాజుగౌడ్, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయ వార్షికోత్సవ వేడుకలు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 7వ డివిజన్ పరిధిలో కట్టమైసమ్మ దేవాలయ ద్వితీయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వార్షికోత్సవానికి పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దేవాలయంలో స్థానిక కార్పొరేటర్ మాడుగుల చంద్రకళ చంద్రారెడ్డి, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్‌లతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. కార్పొరేటర్లు, కో– ఆప్షన్ సభ్యులు, సీనియర్ కాంగ్రెస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

నల్ల చెరువును ఆహ్లాదకరంగా మారుస్తాం

ఉప్పల్: ఉప్పల్ నల్ల చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించి ఆహ్లాదకరంగా మారుస్తామని ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి అన్నారు. గత కొద్దిరోజులుగా ఉప్పల్ జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నల్ల చెరువులో ఆధునిక యంత్రంతో తొలగిస్తున్న గుర్రపు డెక్క పనులను బుధవారం కాంగ్రెస్‌నేత పరమేశ్వర్‌రెడ్డి, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. చెరువు కబ్జాలపై ఇప్పటికే నిఘా పెట్టామని, త్వరలోనే చెరువు పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. రఘుపతిరెడ్డి, మోహన్‌రెడ్డి, లింగంపల్లి రామకృష్ణ, శ్రవణ్‌రెడ్డి, అరుణ్, లుకాస్ తదితరులు పాల్గొన్నారు.

పండుగను ప్రశాంతంగా నిర్వహించుకుందాం

మల్కాజిగిరి: గణేష్ నిమజ్జనాన్ని ప్రశాంతంగా జరుపుకుందామని మల్కాజిగిరి సర్కిల్ డీసీ రాజు అన్నారు. బుధవారం సర్కిల్ కార్యాలయంలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్పొరేటర్ శ్రవణ్ మాట్లాడుతూ.. ప్రతి ఏటా సమావేశం నిర్వహించి తీసుకున్న నిర్ణయాలను అమలు చేయడంలో అధికారులు విఫలమవుతున్నారని ఈసారి అలా జరగకుండా చూడాలన్నారు. సఫిల్‌గూడ నిమజ్జన ఘాట్‌కు వెళ్లే రహదారి మరమ్మతులు చేపట్టాలన్నారు. క్రేన్లు సకాలంలో అందుబాటులో ఉండటమే కాకుండా నిమజ్జనఘాట్‌లో తగినన్ని నీటిని నిల్వ ఉంచాలన్నారు. ఉత్సవ సమితి సభ్యులు మాట్లాడుతూ.. విద్యుత్ విభాగం నుంచి మండపాలకు విద్యుత్ కనెక్షన్లకు డబ్బులు చెల్లించాలని అడుగుతున్నారని అలాంటి నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. బండచెరువు వద్ద విగ్రహాలు మునిగేంత నీటిని ఉంచాలని నిమజ్జనం కాగానే విగ్రహాల పవిత్రత దెబ్బతినకుండా తొలగించాలన్నారు. అందరి సహకారంతో నిమజ్జనం సజావుగా నిర్వహిస్తామని తగిన చర్యలు తీసుకుంటామని డీసీ స్పష్టం చేశారు. కార్పొరేటర్లు శ్రవణ్, రాజ్యలక్ష్మి, ఉత్సవ కమిటీ సభ్యులు ఉడుత నవీన్, దాసన్, రుత్విక్ అధికారులు పాల్గొన్నారు.

హర్‌ఘర్ మే తిరంగా !

- స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు సిద్ధం
- దేశభక్తిని చాటుతున్న తిరంగా ర్యాలీ



తిరంగా ర్యాలీలో కార్పొరేటర్ రాజ్యలక్ష్మి

మౌలాలి: వినాయక్‌నగర్ డివిజన్ వాజ్‌పాయ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో హర్‌ఘర్ తిరంగా అభియానలో భాగంగా తిరంగా ర్యాలీ నాగార్జున సంతోష్ ఆధ్వర్యంలో కాలేజీ విద్యార్థులు స్కూల్ విద్యార్థులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా స్థానిక కార్పొరేటర్ రాజ్యలక్ష్మి, కార్పొరేటర్ శ్రవణ్, ప్రిన్సిపాల్ రమేష్, జగన్, ఏబీవీపీ అఖిల్‌సింగ్, బీజేపీ నాయకులు ఉడుత నవీన్, సురాజ్‌సింగ్, సాయి సురేష్, మహేష్, మధు, సాయి, వివేక్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ జెండాలతో ఆకట్టుకున్న చిన్నారులు



జెండాలను పంపిణీ చేస్తున్న బీజేపీ నేతలు

జేజీఆర్‌లో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు..

బోడుప్పల్: బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను నిర్వహించారు. విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన, పాటలు, కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి పాఠశాల కరస్పాండెంట్ గంగరాజు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ దేశ నాయకుల వేషాధారణలో అలరించారు.

ప్రతి ఇంటిపై జాతీయజెండా ఎగరవేయాలి..

మల్లాపూర్: ప్రధానమంత్రి మోదీ పిలుపు మేరకు స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని మల్లాపూర్ డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి ముత్యంరెడ్డి అన్నారు. బుధవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండాలను పంపిణీ చేశారు. అనంతరం ఇళ్లపై జాతీయ జెండాలను ఎగురవేశారు. బీజేపీ సీనియర్ నేత సంగిశెట్టి రవీంద్రసాగర్, కేశవరం ఆంజనేయులు, వెంకటేష్, రాములు నాయక్, రాంచందర్, పవన్, తిరుపతిరెడ్డి, క్రాంతి, సబిత, సుజాత, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

మహిళా భవన్ ప్రారంభం

మల్కాజిగిరి: మహిళాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎస్పీనగర్‌లో నూతనంగా నిర్మించిన మహిళాభవన్‌ను ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళలు సమిష్టిగా ఏదైనా వ్యాపారం ప్రారంభిస్తే తన వంతు ఆర్థిక సహకారాన్ని అందిస్తానన్నారు. మార్కెట్‌లో పోటీ తత్వం పెరిగిందని, డిమాండ్ ఉన్న వస్తువుల ఉత్పత్తి పరిశ్రమను ఏర్పాటు చేస్తే ప్రభుత్వపరంగా సహకరిస్తానన్నారు. జగదీష్‌గౌడ్, మురుగేష్, లక్ష్మణ్‌రావు, రావుల అంజయ్య, ఉపేందర్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాక్స్ డ్రైన్ పనుల పరిశీలన..

విష్ణుపురికాలనీలో సుమారు రూ 1.97 కోట్లతో చేపట్టిన బాక్స్‌డ్రైన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఇంజినీరింగ్ విభాగం ఏఈ దీపక్, వీఐ రమేష్‌లను పనులు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని సూచించారు. ముంపు సమస్య పరిష్కారానికి బాక్స్‌డ్రైన్లు ఉపయోగపడతాయన్నారు.



మహిళాభవన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



బాక్స్‌డ్రైన్ పనులను పరిశీలించిన మర్రి రాజశేఖర్‌రెడ్డి

ప్రోటోకాల్ పాటించరా.. !

మల్కాజిగిరి: గెలిచి 9 నెలలైనా నిధులు తీసుకుని రాని ఎమ్మెల్యే ప్రారంభోత్సవాల్లో పాల్గొనడం సిగ్గుచేటని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ ఆరోపించారు. ఎస్పీనగర్‌లో కమ్యూనిటీహాల్ (మహిళాభవన్) తాళాలు పగులగొట్టి ప్రోటోకాల్ పాటించకుండా, అధికారులు లేకుండా ప్రారంభించడం సమంజసం కాదన్నారు. 'మైనంపల్లి హన్మంతరావు పేరు చెప్పుకుని అక్రమాలు, పోలీస్ కేసుల నుంచి బయటపడ్డ మాజీ కార్పొరేటర్ తప్పుడు మాటలు ఎమ్మెల్యే వింటే తనకే నష్టమన్నారు'. ఏదో ఓ రోజు ఎమ్మెల్యేకు కూడా వెన్నుపోటు పొడుస్తాడని ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. కమ్యూనిటీహాల్ నిర్మాణంలో ఎమ్మెల్యే పాత్ర ఏమి ఉందని ప్రశ్నించారు. అధికారులను అడిగితే పనులు ఎవరు చేయించారో తెలుస్తుందని చెప్పారు. అభివృద్ధికి ఆటంకం కలగొద్దనే పనులు జరుగుతున్నా ప్రారంభించడం లేదన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఉప్పల్ : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం వాహనాన్ని ఉప్పల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాల ప్రకారం.. రామంతాపూర్ పారిశ్రామికవాడ వద్ద మంగళవారం రాత్రి ఉప్పల్ పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా.. అనుమానాస్పద స్థితిలో వస్తున్న లారీని తనిఖీ చేయడంతో రేషన్ బియ్యం బయటపడ్డాయి. అప్రమత్తమైన పోలీసులు లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. లారీలో ఉన్న 54 బ్యాగుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మానవీయ విలువలను బోధించాలి

రామంతాపూర్ : హృదయ పూర్వక సేవ సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగ అంధ విద్యార్థులకు రామంతాపూర్‌లోని బాలభారతి పాఠశాల విద్యార్థులు సహాయనిధిని సేకరించి దివ్యాంగులైన విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ముఖ్యఅతిథులు సీనియర్ సిటిజన్ సంఘం అధ్యక్షుడు సత్తిరాజు, కపర్థీశ్వర్‌రావు, హృదయ భారతి చైర్మన్ డాక్టర్ మంగళ, యోగా గురువు ఆచార్య రమేష్‌లు మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యతో సమాజంలో సాటి మనిషికి సహాయ పడటం వంటి మానవీయ కోణం విషయాలను బోధించాలన్నారు. నాగమణి తదితరులు న్నారు.

ఫలహారం బండి ఊరేగింపు

మల్లాపూర్: మల్లాపూర్ నందీశ్వరాలయం దేవాలయం నుంచి గడ్డమీది శ్రీహరీగౌడ్ ఆధ్వర్యంలో ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. డప్పుచప్పుళ్లు, పోతరాజుల విన్యాసాల మధ్య మల్లాపూర్ జనప్రియ పోచమ్మ దేవాలయం వరకు ఫలహారం బండి ఊరేగింపు జరిగింది. ముఖ్య అతిథిగా మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఎస్వీ శివకుమార్, పీఆర్. ప్రవీణ్, సీహెచ్. శ్రీనివాస్, వాసుగౌడ్, శ్యామ్‌సుందర్‌రెడ్డి, మల్లేష్, నెమలి అనిల్, శ్రావణ్, రాములు, నిర్వాహక కమిటీ సభ్యులు, పీఆర్, నాగరాజు, పీజీ సుదర్శన్, కోయలకొండ రాజేష్, సాయిగౌడ్, జగన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని..

బైక్‌పై వెళ్తున్న ఒకరి మృతి మరొకరికి గాయాలు

ఉప్పల్ : ఆటో ఢీకొని రాపిడో బైక్‌పై ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి మృతి చెందగా డ్రైవర్‌కు తీవ్ర గాయాలైన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన సుందర్‌రాజు కోదం (23) మహాత్మగాంధీబస్‌స్టేషన్ వెళ్లేందుకు ఉప్పల్ ఎక్స్‌రోడ్డు నుంచి రాపిడో బైక్‌ను (ఏపీ29బీయూ 4543)ను బుక్ చేసుకున్నాడు. ఉప్పల్ చౌరస్తా వద్ద వాహనాన్ని ఎక్కించుకున్న బైక్ డ్రైవర్ శ్రీనివాస్ (46) నాగోల్ మెట్రో స్టేషన్ వద్ద యూటర్న్ చేస్తుండగా.. నాగోల్ నుంచి అతివేగంగా వచ్చిన ఆటో (టీఎస్07యూఎల్ 9097) ఢీకొట్టడంతో వెనుక కూర్చున్న సుందర్‌రాజు మెట్రో డివైడర్‌పై పడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయాలు కాగా.. బైక్ రైడర్ శ్రీనివాస్ తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది పరీక్షించగా.. సుందర్‌రాజు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. గాయపడిన శ్రీనివాస్‌ను చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

కేరళ సీఎం సహాయనిధికి విరాళం

కాప్రా: కేరళ ప్రభుత్వం సీఎం సహాయనిధికి కాప్రా డాక్టర్ బొందాడ గ్రూప్ విరాళం అందజేశారు. బొందాడ గ్రూప్ సీఎండీ రాఘవేందర్‌రావు కేరళ సీఎం పినరయి విజయన్‌ను కలిసి రూ. 25 లక్షల విరాళం అందజేశారు. తెలుగురాష్ట్రాల నుంచి కేరళ ప్రభుత్వానికి సహకారం అందిస్తున్నందుకు ఆ రాష్ట్ర సీఎం కృతజ్ఞతలు తెలిపినట్లు రాఘవేందర్‌రావు చెప్పారు.

మంత్రికి ఘన స్వాగతం



బోడుప్పల్: విదేశీ పర్యటన ముగించుకుని రాష్ట్రానికి తిరిగొచ్చిన మంత్రి శ్రీధర్‌బాబును బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, కార్పొరేటర్లు చీరాల నర్సింహ్మ, కుంభం కిరణ్‌కుమార్ రెడ్డి, భూక్యా సుమన్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ బీ–బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్ స్వాగతం పలికారు. బుధవారం శంషాబాద్ విమానాశ్రయంలో పుష్పగుచ్ఛం అందజేశారు. అమెరికా పర్యటన ముగించుకుని వచ్చిన మంత్రిని సత్కరించారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

కాప్రా: కాప్రా డివిజన్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి కాప్రా కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి వినతిపత్రం అందజేశారు. డివిజన్‌లో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి నూతన వాటర్ రిజర్వాయర్ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. శ్రీసాయిఎన్‌క్లేవ్‌లో రూ.30 లక్షలతో నూతన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి జలమండలి ఎండీ సానుకూలంగా స్పందించారని కార్పొరేటర్ వివరించారు.

నష్టపరిహారం ఇవ్వాలని వినతి


మల్కాజిగిరి: వాజ్‌పేయ్‌నగర్ ఆర్‌యూబీ నిర్మాణంలో భాగంగా నివాసాలు కోల్పోతున్న కేశవ్‌నగర్, భగత్‌సింగ్ నగర్ ప్రజలకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం ఇప్పించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గతంలో రోడ్డు విస్తరణతో ఇళ్లు కోల్పోయామని అప్పటి ప్రభుత్వం నుంచి ఎలాంటి నష్టపరిహారం రాలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలోనైనా న్యాయం చేయాలని లేదంటే రోడ్డున పడతామని ఎమ్మెల్యేను కోరామన్నారు.
















సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220376 | 9912220571
9912225470 | 9505507657